పిల్లల కోసం తాత్కాలికంగా నిర్వహించిన ఆధార్ కేంద్రం(ఫైల్)



'ఆధార్' అవస్థలు

భీమారం: మండల కేంద్రంలో శాశ్వత ఆధార్ కేంద్రం లేక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. దీంతో ఆధార్ కార్డుల్లో ఎలాంటి తప్పిదాలు ఉన్నా మంచిర్యాల లేక చెన్నూర్ పట్టణాలకు వెళ్లాల్సి వస్తోంది. మారుమూల గ్రామాల నుంచి పట్టణాలకు వెళ్లిన సమయంలో సర్వర్ సమస్యలు ఎదురైతే, తిరిగి ఇంటికి రావాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రతీ మండల కేంద్రంలో శాశ్వత ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, ఇప్పటివరకూ అది అమలు కావడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శాశ్వత ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



'మమత' ఆధ్వర్యంలో సంబురాలు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మహిళా తరంగిణి(మమత) సంస్థను 2009ఫిబ్రవరి 6న ఏర్పాటు చేసి 15సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్రంలో మమత సభ్యులు వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. 15ఏళ్లుగా మహిళలకు అందించే సహకారంతో పాటు, పేద ప్రజలకు అందించిన సేవా కార్యక్రమాలను కొనసాగిస్తూ, ప్రజల్లోకి మరింత ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయించారు. కార్యక్రమంలో ఫౌండర్ గోనె భాగ్యలక్ష్మి, అధ్యక్షురాలు మంజుల కృష్ణారావు, కార్యదర్శి లత, నాగమణి, కొత్త లీల, సునీత, సత్యప్రియ, వీరమణి, డాక్టర్ పావని, అన్నపూర్ణ, వనజ, సత్యవతి, శ్రీదేవి గౌడ్, చంద్రకళ, వనజ, సభ్యులు పాల్గొన్నారు.

శ్రీరాంపూర్: వేడుకల్లో పాల్గొన్న మహిళలు



ఘనంగా రమాబాయి జయంతి

లక్సెట్టిపేట/భీమారం/శ్రీరాంపూర్/బెల్లంపలి: రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ సతీమణి రమాబాయి జయంతిని లక్సెట్టిపేట, భీమారం, శ్రీరాంపూర్, బెల్లంపల్లిలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. భీమారం మండలకేంద్రంలోని ఆవిడం క్రాస్ రోడ్డు వద్ద, లక్సెట్టిపేట అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో అంబేడ్కర్ భవన్‌లో, శ్రీరాంపూర్ కృష్ణా కాలనీలో, బెల్లంపల్లి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ఆవరణలో రమాబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహిళలు ఆమె జీవితాన్ని, ఆమె త్యాగాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. మహిళలకు క్రీడలు, క్విజ్ పోటీలు, మహనీయుల పాటల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు.



రోడ్లపైనే వాహనాల పార్కింగ్

కోటపల్లి: మండలంలోని పార్‌పల్లి జాతీయ రహదారి సమీపంలోని చింత జిన్నింగ్ మిల్లువద్ద వాహనాలు అడ్డదిడ్డంగా వాహనాలు నిలుపుతున్నారు. పార్‌పల్లి, లింగన్నపేట, ఎదులబంధం, సిర్సా, రొయ్యలపల్లి, ఆలుగామ, జనగామ, సుపాక, వెంచపల్లి గ్రామాల నుంచి నిత్యం వందల కొద్ది వాహనాలు చెన్నూర్ ప్రాంతాలకు వెళ్లాలంటే ఇదే రహదారిమీదుగా వెళ్లాల్సి ఉండగా, వాహనాల రోడ్డుపై నిలుపుతుండటంతో గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోతుంది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుపైన వాహనాలు నిలుపకుండా చూడాలని ఆయా గ్రామాల వాహనదారులు కోరుతున్నారు.

జాతరకు వేళాయె..!

- భక్తుల కొంగుబంగారంలా నిలుస్తున్న నరనారాయణస్వామి
- కలమడుగులో ఈ నెల 9 నుంచి 13 వరకు ఉత్సవాలు
- ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి



ముస్తాబైన ఆలయం, ఆలయంలో దేవతా మూర్తులు

జన్నారం: భారతదేశంలో కృష్ణార్జునులు కొలువై ఉన్న ఆలయాలు హిమచల్‌ప్రదేశ్‌లోని బద్రినారాయణ ఆలయం మొదటిది కాగా, తెలంగాణ రాష్ట్రంలో రెండోది శ్రీ నరనారాయణ స్వామి ఆలయం. గోదావరి నది తీరంలో కాకతీయుల కాలంలో వెలిసిన శ్రీ నరనారాయణ స్వామి ఆలయ వార్షికోత్సవం ఈ నెల 9నుంచి 13వరకు నిర్వహించనుండగా, జాతరకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. జన్నారం మండలం కలమడుగు గోదావరి తీరాన నిర్మించిన ఈ ఆలయంలో గల నరనారాయణ స్వామి (శ్రీ కృష్ణార్జునులు) కోరుకున్న భక్తులకు కొంగు బంగారంగా నిలుస్తున్నారు. ఏటా మాఘ మాస పౌర్ణమికి మూడు రోజులు జాతర జరుపుతారు. జాతర పురస్కరించుకొని ఆలయ కమిటీ ఆలయాన్ని ముస్తాబు చేస్తున్నారు. వేములవాడ చాళుక్యుల కాలంలో నిర్మించిన ఈ ఆలయాన్ని 1985 జూన్ 7న పునర్నిర్మించారు. అప్పటి నుంచి వార్షికోత్సవం జరుపుతున్నట్లు ఆలయ కమిటీ పేర్కొంది. ఈ నెల 9నుంచి కార్యక్రమాలు ప్రారంభం కాగా, ఈ నెల 13న రథోత్సవంతో జాతర కార్యక్రమాలు పూర్తవుతాయి. అట్టహాసంగా నిర్వహించే ఆలయ 40వ వార్షికోత్సవానికి ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది. ఈ జాతరకు పలువురు ప్రముఖులు హాజరుకానున్నారు.

వార్షికోత్సవ కార్యక్రమాలు..

9న అగ్గిమల్లన్న స్వామికి బోనాలు, నగర సంకీర్తన చేసి గ్రామస్తులంతా గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరిస్తారు. 11న నరనారాయణ స్వామి పూర్ణాభిషేకం, వీరాంజనేయస్వామికి అభిషేకం, నవగ్రహ తైలాభిషేకం, ధర్మ ధ్వజారోహన, తులసి పూజ, గోపూజ, విష్ణుసహస్ర నామార్చన, కుంకుమ పూజలు నిర్వహించనున్నారు. 12న శ్రీ కృష్ణ అష్టోత్తర శతనామావళి, సంపూర్ణ గీతహవన హోమాలు, విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు, 13న నరనారాయణ స్వామి, ఆంజనేయస్వామి దేవతా మూర్తులకు అభిషేకం, రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ యాదగిరి స్వదేశ్ రావు, గౌరవ అధ్యక్షులు కాకర నర్సయ్య, సభ్యులు తిరుమల అంజగౌడ్, కిషన్‌గౌడ్, నరేంద్రశర్మ, బొంతల మల్లేశ్, శంకరయ్య, జనార్దన్‌రావు, వెంకటేశం, అంజిత్, జగన్‌లు తెలిపారు.

మహిమ గల దేవుడు



వేములవాడ రాజధాని సమయంలో చాళుక్యులు ఆలయం నిర్మించినట్లు పూర్వీకులు చెబుతున్నారు. ఈ దేవుడు చాల మహిమ గల దేవుడు. దేశంలో నరుడు, నారాయణుల ఆలయాలు బద్రినాథ్ ఆలయం తర్వాత కలమడుగు గోదావరి తీరాన నిర్మితమైంది. స్వయంభువుగా వెలిసిన స్వామి మహిమగల దేవుడు.

\- కాకర రాజనరేంద్రశర్మ, ప్రధాన అర్చకులు

ఏర్పాట్లు పూర్తి చేశాం



కలమడుగు నరనారాయణ స్వామి జాతరకు ప్రత్యేకత ఉంది. దేశంలో రెండో ఆలయంగా పేరున్న మా గ్రామ ఆలయానికి జాతర సమయంలో భక్తుల తాకిడి ఉంటుంది. జాతరకు గ్రామస్తులందరం ఏర్పాట్లు చేస్తున్నాం. మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల జిల్లాల నుంచి అనేక మంది భక్తులు తరలివస్తారు.

\- యాదగిరి స్వదేశ్‌రావు, ఆలయ కమిటీ చైర్మన్

క్లుప్తంగా

యూజీసీ ముసాయిదా ఉపసంహరించుకోవాలి

మంచిర్యాలఅర్బన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తి కుదించే ప్రయత్నం చేస్తుందని, యూజీసీ ముసాయిదాను ఉపసంహరించుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ అన్నారు. మంచిర్యాల మార్క్స్‌భవన్‌లో శుక్రవారం పీడీఎస్‌యూ జిల్లా కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా నాయకులు సిద్దార్థ్, కార్తీక్, రాహుల్, రాజ్‌కుమార్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

చిరుతల రామాయణం ప్రదర్శన



చిరుతల రామాయణం ప్రదర్శిస్తున్న కళాకారులు

భీమారం: మండలంలోని అంకూసాపూర్‌లో స్థానిక కళాకారులు శుక్రవారం చిరుతల రామాయణం ప్రదర్శించారు. గ్రామీణ ప్రజలకు అర్థం అయ్యేలా పాత్రలకు తగ్గట్టు వేషధారణలో ఆకట్టుకున్నారు. అంకూసాపూర్, తాళ్లగూడెం, భీమారం నుంచి ప్రజలు తరలివచ్చారు.

బీసీల సమస్యలు పరిష్కరించాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: దేశంలో కులగణన లెక్కలు సమగ్ర చేపట్టాలని, బీసీల సమస్యలు పరిష్కరించాలని బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో శుక్రవారం బీసీ నాయకులు జిల్లా అదనపు కలెక్టర్ చాంబర్‌లో అదనపు కలెక్టర్‌కు మోతిలాల్‌కు వినతిపత్రం అందజేశారు. దేశంలో జనగణలో కులగణన జరుపాలని, పార్లమెంట్ సమావేశాల్లోనే బీసీలకు 50 శాతం రిజర్వేషన్ బిల్లు పెట్టి అమలు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ హక్కుల సాధన సమితి జిల్లా కార్యదర్శి శంకరయ్య, తదితరులు పాల్గొన్నారు.

కుల గణన తప్పుల తడక



నిరసన తెలుపుతున్న నాయకులు

పాతమంచిర్యాల: ప్రభుత్వం చేపట్టిన కులగణన తప్పుల తడక అని బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో నాయకులు కులగణనను నిరసిస్తూ కళ్లకు గంతలు కట్టుకుని నిరసన, మౌన ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ హక్కుల పోరాట సమితి నాయకులు చుంచు రాజ్‌కిరణ్, కర్రె లచ్చన్న, గజెల్లి వెంకటయ్య, శాఖపురి భీంసేన్, శ్రీపతి రాములు, చంద్రమౌళి, బండ సతీష్, అంకం సతీష్, అరేందుల రాజేశం, విజయభాస్కర్ పాల్గొన్నారు.

స్థలం కేటాయించాలని తహసీల్దార్‌కు వినతి

జైపూర్: మండల కేంద్రంలో మహాత్మజ్యోతి బాపూలే, సావిత్రిబాయి విగ్రహాల ఏర్పాటుకు స్థలం కేటాయించాలని తహసీల్దార్ వనజారెడ్డికి బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బల్మూరి అరవీందర్ రావు, జిల్లా నాయకులు ఆర్నే సమ్మయ్య, జాడి ఏసయ్య, స్థానిక మాజీ సర్పంచ్ ఆసంపల్లి సువర్ణరాజమల్లు, మాజీ ఎంపీటీసీ రామటెంకి లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

బర్డ్ ఫ్లూ వ్యాధిపై అవగాహన

భీమారం: మండలంలోని పోలంపల్లి సమీపంలో గల పౌల్ట్రీఫాంను శుక్రవారం మండల పశు వైద్యాధికారి రాకేశ్ శర్మ సందర్శించారు. కోళ్లకు బర్డ్ ఫ్లూ వ్యాధి సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. ముఖ్యంగా బర్డ్ ఫ్లూ రాకుండా జాగ్రత్తలు తీసుకుంటే నష్టాన్ని నివారించవచ్చన్నారు.

చోరీ కేసులో ఇద్దరి అరెస్ట్



నిందితుల అరెస్టు చూపుతున్న ఎస్సై

రామకృష్ణాపూర్: రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కోటేశ్వర్‌రావుపల్లెలో జరిగిన ఓ చోరీ కేసులో నిందితులను శుక్రవారం అరెస్టు చేసినట్లు పట్టణ ఎస్సై రాజశేఖర్ తెలిపారు. కోటేశ్వర్‌రావుపల్లెకు చెందిన కందికట్ల సత్తమ్మ ఆమె కుటుంబసభ్యులతో కలిసి గురువారం బయటకు వెళ్లింది. ఇంట్లో ఎవరూ లేనిది చూసి తాళాలు పగులగొట్టి లోనికి ప్రవేశించిన దొంగలు ఇంట్లోని బీరువాలో దాచిన మూడు తులాల బంగారం, 16తులాల వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లారని తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుండగా శుక్రవారం పట్టణంలో పెట్రోలింగ్ చేస్తున్న క్రమంలో ఇద్దరు వ్యక్తులు నదీమ్ అన్సారీ(పాత నేరస్తుడు), అతడి అనుచరుడు అబ్దుల్‌కరీం అనుమానాస్పదంగా కనిపించారు. వారి వద్ద ఉన్న పర్సును తెరిచి చూడగా అందులో బంగారు, వెండి ఆభరణాలు కనిపించినట్లు ఎస్సై పేర్కొన్నారు. అవి ఎక్కడివని విచారించగా దొంగతనం విషయం బయటకొచ్చిందని తెలిపారు. ఈ మేరకు ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

బీర్‌సీసాలతో దాడి

బెల్లంపల్లి: బెల్లంపల్లి కాల్‌టెక్స్ ఏరియాలోని ఓ బార్‌షాప్‌లో శుక్రవారం ఘర్షణ జరిగింది. టూటౌన్ ఎస్సై కె.మహేందర్ కథనం ప్రకారం.. తాండూర్‌కు చెందిన బండారి వంశీ అనే యువకుడు, బెల్లంపల్లి గాంధీనగర్‌కు చెందిన అల్లిసాగర్, అతని స్నేహితులతో కలిసి మద్యం తాగడానికి బార్ షాప్‌కు వెళ్లారు. చిత్తుగా తాగిన తర్వాత అక్కడే మద్యం సేవిస్తున్న వంశీపై సాగర్ ఘర్షణ పడ్డారు. రెచ్చిపోయిన సాగర్, అతడి అనుచరులు బీరు సీసాలు పగులగొట్టి వంశీపై విచక్షణ రహితంగా దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అల్లిసాగర్, మరికొందరిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కారు బీభత్సం.. ఒకరి మృతి



ఇంట్లోకి దూసుకెళ్లిన కారు

గోవిందరావుపేట: ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం బుస్సాపూర్ గ్రామంలో ఓ కారు బీభత్సం సృష్టించడంతో ఓ వ్యక్తి మృత్యువాతపడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం.. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లికి చెందిన పలువురు శుక్రవారం లక్నవరం చూసేందుకు వెళ్తున్నారు. బుస్సాపూర్ గ్రామంలో కారును అతివేగంగా నడపడంతో అదుపుతప్పింది. రోడ్డు పక్కనే ఉన్న నోబుల్‌రెడ్డి ఇంటి ఆవరణలోకి దూసుకెళ్లింది. ఇంటి ఆవరణలో కట్టెలు కొడుతున్న కట్ల నర్సిరెడ్డి(70)ని ఢీకొట్టింది. దీంతో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. అప్పటికీ ఆగకుండా కారు నోబుల్‌రెడ్డి ఇంట్లోకి దూసుకెళ్లింది. దీంతో ఇల్లు పాక్షికంగా ధ్వంసం కావడంతోపాటు సామగ్రి చెల్లాచెదురైంది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. కారులోని వ్యక్తులు పారిపోయారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

క్రైం కార్నర్..

రైలుకింద పడి మహిళ ఆత్మహత్య

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ గంగారాంనగర్ ఎదుట ఉన్న రైల్వేట్రాక్‌పై గుర్తు తెలియని రైలుకింద పడి ఓ వివాహిత మహిళ ఆత్మహత్య చేసుకుంది. జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ ఈ.రాజేశ్వర్ కథనం ప్రకారం... బెల్లంపల్లి హన్మాన్ బస్తీకి చెందిన రాళ్లబండి. భాగ్యవతి(45) ఉదయం 7గంటల ప్రాంతంలో రైలుకింద పడి ఆత్మహత్య చేసుకుంది. ఆమె కొన్ని రోజుల నుంచి అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. పేదరికంతో వైద్యం చేయించుకోలేక జీవితంపై విరక్తి చెంది బలవన్మరణానికి పాల్పడినట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు. ఈ మేరకు మృత దేహానికి పోస్టుమార్టం చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతురాలికి ఇద్దరు ఆడ బిడ్డలు ఉన్నారు. భర్త రాళ్లబండి. శ్రీని వాస్ ఇచ్చిన ఫిర్యాదు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

దండేపల్లి: మండలంలోని తాళ్లపేట సమీపంలో శుక్రవారం రాత్రి జరగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దంపతులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. బుగ్గారం మండలం వెల్గొండకు చెందిన అక్కల శేఖర్–సునీత దంపతులు ద్విచక్రవాహనంపై జన్నారం మండలం రోటిగూడకు వెళ్లారు. తిరుగుప్రయాణంలో ఇసుక ట్రాక్టర్ ఢీకొనడంతో దంపతులిద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వారిని స్థానికులు అంబులెన్సులో లక్సెట్టిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలకు రెఫర్ చేశారు.

ఆధ్యాత్మికం

విగ్రహ ప్రతిష్టాపన



విగ్రహాలు ప్రతిష్టిస్తున్న వేద పండితులు

చెన్నూర్‌రూరల్: చెన్నూర్‌లోని గోదావరి నది ఒడ్డున హనుమాన్ ఆలయ ఆవరణలో నూతనంగా నిర్మించిన పాండురంగ, విఠల రుక్మిణీ బాయి ఆలయంలో శుక్రవారం విగ్రహ ప్రతిష్టాపన నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

కనుల పండువగా విగ్రహ ప్రతిష్టాపన

మందమర్రిరూరల్: మండలంలోని సారంగపల్లి గ్రామపంచాయతీ పరిధిలో గల దుబ్బపల్లిలోని శ్రీఅభయాంజనేయ స్వామి దేవాలయం పక్కన రమాసమేత శ్రీసత్యనారాయణస్వామి విగ్రహ ప్రతి ష్టాపన శుక్రవారం కనుల పండువగా నిర్వహించారు. మిట్టపల్లి సత్యనారాయణ శాస్త్రి, వేద పండితులు కట్టా నరసింహశాస్త్రి బృందం ఆధ్వర్యంలో మంత్రోచ్చారణలతో విగ్రహాలను ఆలయంలో ప్రతిష్టించారు. గణపతిపూజ, మండల పూజ, హోమాలు శిఖర కలశ ప్రతిష్ఠ, మహాపూర్ణాహుతి నిర్వహించారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్యే వివేక్, తహసీల్దార్ సతీష్‌కుమార్, ఎంపీడీవో రాజేశ్వర్, వేదపండితులు, భక్తులు పాల్గొన్నారు.

ధ్వజస్తంభానికి ఇత్తడి తొడుగు

వేమనపల్లి: మండల కేంద్రంలోని పురాతన అన్నపూర్ణ సహిత విశ్వేశ్వరాలయానికి కొత్త శోభ సంతరించుకుంది. మహాశివరాత్రికి ముందే గుడికి రంగులు అద్దడం మొదలు పెట్టగా, ధ్వజస్తంభానికి ఇత్తడి తొడుగు చేయిస్తున్నారు. మద్దెర్ల శ్రావణ్ రూ.లక్ష, మద్దెర్ల కృష్ణమూర్తి రూ.50వేలు విరాళంగా అందజేశారు. జనగామ జిల్లా పెంబర్తికి చెందిన డి.ఉప్పలయ్య చేతి వృత్తుల కళాకారుల బృందం తొడుగు పనుల్లో నిమగ్నమై ఉన్నారు.

నేడు గీతా యజ్ఞం

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్‌లోని ఆర్కే–8 కాలనీ గీతా మందిర్‌లో శనివారం గీతాయజ్ఞం నిర్వహించినట్లు గీతా సత్సంగం అధ్యక్షుడు దాసరి రాజేశం, కన్వీనర్ డీడీ ప్రసాద్ తెలిపారు. గీతా మందిరం వద్ద శుక్రవారం గీతాయజ్ఞం పోస్టర్ ఆవిష్కరించారు. ఆలయం 33వ వార్షికోత్సవం, భీష్మ ఏకాదశిని పురస్కరించుకొని ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ ఉంటుందన్నారు.

పవర్‌కట్ ప్రాంతాలు



నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండల కేంద్రంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నిర్వహణ కారణంగా 8వ తేదీ శనివారం ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12–30గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ మహేందర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హాజీపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని టీకానపల్లి, దొనబండ, పెద్దంపేట, బుద్దిపల్లి, కొండాపూర్, కర్ణమామిడి, పడ్తనపల్లి, కొండపల్లి, రాంపూర్, హాజీపూర్‌లలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

లక్సెట్టిపేటలో...

లక్సెట్టిపేట: మండలంలోని వెంకట్రావుపేట 33కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో ఈ నెల 8న ఉదయం 10గంటల నుంచి 11–30నిమిషాల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ గణేశ్ తెలిపారు. కొత్త కొమ్ముగూడెం, పాత కొమ్ముగూడెం, దొడపల్లి, తలమల, చెల్లంపేట, ఎల్లారం, కొత్తూరు, చందారం, రంగపేట, హన్మంతుపల్లి గ్రామాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. సబ్‌స్టేషన్ మరమ్మతుల దృష్ట్యా సరఫరా నిలిపివేస్తున్నట్లు వినియోగదారులు సహకరించాలన్నారు.

వేమనపల్లిలో...

వేమనపల్లి: మండలంలోని లక్ష్మీపూర్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం 10.30గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ దీక్షిత్ తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని బద్దంపల్లి, నాగారాం, జిల్లెడ, లక్ష్మీపూర్, జక్కపల్లి, మామిడిపల్లి, చామనపల్లి, సూరారం, బుయ్యారం, బొమ్మెన గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోనున్నట్లు వినియోగదారులు సహకరించాలని కోరారు.

అటెన్షన్ ప్లీజ్..

'రక్షణ' కరువు..



దండేపల్లి: మండలంలోని నెల్కివెంకటాపూర్ సమీపంలో వందుర్‌గూడ వెళ్లే రోడ్డులో కడెం డిస్ట్రిబ్యూటరీ 30వ కాల్వ దాటేందుకు కల్వర్టు నిర్మించారు. కల్వర్టుకు ఇరువైపులా ఎలాంటి రక్షణ దిమ్మెలు లేవు. దీంతో వాహనదారులు కల్వర్టుగుండా కాల్వదాటే సమయంలో ఏమాత్రం ఆదమరిచినా ప్రమాదం జరిగే అవకాశం ఉంది. అధికారులు స్పందించి కల్వర్టుకు ఇరువైపులా రక్షణ దిమ్మెలు నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

సంబంధిత అధికారి : సంజీవ్, ఇరిగేషన్ ఏఈఈ

ఫోన్ నంబర్ : 91549 51581

సంక్షిప్త వార్తలు

● 'మిమ్స్'లో రక్తదాన శిబిరం

మంచిర్యాలఅర్బన్: స్థానిక మిమ్స్ డిగ్రీ కళాశాలలో స్వర్గీయ జువ్వాడీ వెంకటేశ్వరావు స్మారకార్థం శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. విద్యార్థులు, అధ్యాపకులు దాదాపు 100యూనిట్ల రక్తదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ శ్రీనివాసరాజు, ప్రిన్సిపాల్ ఉపేందర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ శ్రీధర్‌రావు పాల్గొన్నారు.

● విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన

జన్నారం: మండలంలోని పొనకల్‌లో శుక్రవారం జన్నారం ఎంఈవో విజయ్‌కుమార్, ఏఎస్సై సురేశ్, కానిస్టేబుళ్లు శ్రీనివాస్‌లు బడికి రాని విద్యార్థుల ఇంటికి వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడారు. పదో తరగతి పరీక్షలు దగ్గర పడుతున్నందునా పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని, అదే విధంగా వేరే తరగతుల పిల్లలకు పరీక్షలు పెడుతున్నామని వారు తల్లిదండ్రులతో పేర్కొన్నారు. పాఠశాలకు విధిగా హాజరయ్యేలా తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలని కోరారు.

● పోస్టర్ ఆవిష్కరణ

పాతమంచిర్యాల: కర్నూలులో ఈ నెల 8, 9తేదీల్లో నిర్వహించే విరసం మహాసభలను విజయవంతం చేయాలని విరసం జిల్లా కన్వీనర్ రాజయ్య అన్నారు. జిల్లా కేంద్రంలో మహాసభల పోస్టర్ శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రజాఫంట్ జిల్లా కన్వీనర్ జైపాల్‌సింగ్ పాల్గొన్నారు.

● దండేపల్లి ప్రత్యేకాధికారిగా దుర్గాప్రసాద్

దండేపల్లి: మండల ప్రత్యేకాధికారిగా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దుర్గాప్రసాద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు ఇక్కడ ప్రత్యేకాధికారిగా పనిచేసిన రవీందర్ రెడ్డి దీర్ఘకాలిక సెలవులో ఉండటంతో, ఆయన స్థానంలో దుర్గప్రసాద్‌ను నియమించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం మండలంలోని తాళ్లపేట, రాజుగూడలో పారిశుధ్య పనులు పరిశీలించారు.

● 'తప్పుడు సమాచారం ఇచ్చారు'

దండేపల్లి: దండేపల్లి స్టేషన్ హౌస్ ఆఫీసర్‌ను రేషన్ బియ్యం కేసు విషయంలో సమాచార హక్కు చట్టం ద్వారా సమాచారం కోరితే తప్పుడు సమాచారం ఇచ్చారని దండేపల్లికి చెందిన గుండ రవీందర్ ఆరోపించారు.

● విద్యార్థులకు టాలెంట్ పరీక్ష

లక్సెట్టిపేట: శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో జన్నారం, దండేపల్లి, లక్సెట్టిపేట, హాజీపూర్ మండలాల ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల పదో తరగతి విద్యార్థులకు శుక్రవారం టాలెంట్ పరీక్ష నిర్వహించారు. 42పాఠశాలలకు చెందిన 126మంది విద్యార్థులు హాజరై పరీక్ష రాసారు.